క్లుప్తంగా

చదువుపై దృష్టి పెట్టాలి


చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

ఓర్వకల్లు: విద్యార్థులు చిన్నతనం నుంచే చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారిని కౌసల్య సూచించారు. ఆదివారం మండలంలోని నన్నూరు శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. లైబ్రేరియన్ కౌసల్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా చిన్న పిల్లలకు క్యారంబోర్డు, చెస్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం


పెద్దపాడులో నిరుపయోగంగా ఉన్న ఐసీడీఎస్ భవనం

కల్లూరు: కల్లూరు అర్బన్ 36వ వార్డు పెద్దపాడులో ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనంను ముందు ఖాళీ స్థలం కూడా ఉంది. భవనానికి మరమ్మతులు చేసి ఎదైనా ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకోవచ్చని ప్రజలు సూచిస్తున్నారు. వినియోగంలో లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంటోందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ప్రజా ధనం వృథా కాకుండా నిరుపయోగంగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

రోడ్డును బాగు చేయండి


దెబ్బతిన్న వంద అడుగుల రోడ్డు

కల్లూరు: నగరంలోని నంద్యాల రోడ్డు నుంచి దిన్నెదేవరపాడు రోడ్డుకు వెళ్లే వంద అడుగుల రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఈ వంద అడుగుల రోడ్డు నంద్యాల రోడ్డు నుంచి ప్రారంభమయ్యే చోటనే గుంత ఏర్పడింది. అక్కడి నుంచి ముందుకు ప్రయాణిస్తే రోడ్డు రెండు వైపులా ధ్వంసమైంది. ఈ రోడ్డుపై నిత్యం వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆర్ఎస్‌కే భవనం ప్రారంభం

పాణ్యం: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. ఆదివారం కౌలురు గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్ సెంటర్, రైతు సేవా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ భవనాలను నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం పలు అభివద్ది పనులపై ఆరా తీశారు. తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ బాలయ్య, ఏఈ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ రింక్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాజవర్ధన్ రెడ్డి మెమోరియల్ జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అండర్ -14 బాలుర విభాగంలో ఎథెనా స్కూల్ (ప్రథమ), ఎస్.డి.ఆర్ స్కూల్ (ద్వితీయ), బాలికల విభాగంలో ఎస్డీఆర్ స్కూల్ (ప్రథమ), ఇండస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ (ద్వితీయ), అండర్ -17 బాలుర విభాగంలో ఎస్‌డీఆర్ స్కూల్ (ప్రథమ), ఎడిఫై స్కూల్ (ద్వితీయ), బాలికల విభాగంలో మాంటీ ఇంగ్లిష్ మీడియం (ప్రథమ), అథీనా స్కూల్ (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు ట్రోఫీ, బహుమతులు, మెడల్స్‌ను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అందజేశారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు దాదాబాషా, ముస్తాహీర్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

కర్నూలు (టౌన్): ఈనెల 20వ తేదీ సోమవారం దీపావళి పండుగను పురస్కరించుకొని సెలవు కావడంతో నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు గమనించాలని, స్థానిక కాలనీల్లోని సమస్యలపై పుర మిత్ర యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

కోటి సంతకాలతో కనువిప్పు కలిగిస్తాం


సంతకాల సేకరణ కరపత్రాలను విడుదల చేస్తున్న కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్, మణిగాంధీ తదితరులు


గార్గేయపురంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న నాయకులు

- కూటమి ప్రభుత్వ కుట్రలను ప్రజలకు తెలియజేయాలి
- ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ
- వైఎస్సార్‌సీపీ నాయకులతో కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్ సమావేశం

కోడుమూరు రూరల్: పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను దక్కకుండా కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని.. కుట్రమి ప్రభుత్వ కుట్రలను ప్రజలకు తెలియజేసి చైతన్య పరచాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం కర్నూలులోని బాలాజీనగర్‌లో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎస్ఈసీ సభ్యులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, సీఈసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోట్ల హర్ష, సతీష్ మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం, విద్యను అందించాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే సీఎం చంద్రబాబు వాటిని పూర్తి చేయలేక పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలంతా నియోజకవర్గంలో ఉద్యమంలా చేపట్టి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి వారి నుంచి సంతకాలు సేకరించాలని సూచించారు. కోటి సంతకాలతో కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దామని పిలుపునిచ్చారు. కూటమి పాలనలో అన్యాయం జరిగిన వారు, రాజకీయ వేధింపులకు గురైన వారంతా డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్తకు జగనన్న అండగా ఉంటారని వారు సూచించారు. కార్యక్రమంలో కర్నూలు జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, ఉల్చాల సర్పంచు విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పోలకల్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పాటిల్ హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మోహన్‌బాబు, వాసు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వెంకటేష్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు గిరిప్రసాద్, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బోజన్న, ఎంపీటీసీ హనుమంతు, నాయకులు సంపత్‌కుమార్, మహేష్, జగన్‌మోహన్ రావు, మధుసూదన్, దత్తు, రాము, మహేంద్రగౌడ్, ప్రభు దాస్, మల్లికార్జున, శేఖర్, సురేష్, దామోదర్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణను జయప్రదం చేయాలి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ కర్నూలు మండలంలోని గార్గేయపురం గ్రామ నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు కమిటీ సభ్యులతో సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వినయ్‌కుమార్‌రెడ్డి, మద్దిలేటి రెడ్డి, మండలాధ్యక్షుడు మోహన్‌బాబు, నాయకులు రామక్రిష్ణ యాదవ్, గౌతమ్, మధుశేఖర్, చంద్రశేఖరరావు, కోటిరెడ్డి, నాగిరెడ్డి, అజివుల్లా, రిహాజ్, సుభాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిక్షణ కేంద్రం ప్రారంభం

కల్లూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీజీ లక్ష్మీ వెంకటేష్ వాసవీ భవన్‌లో మహిళా శిక్షణ కేంద్రాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, రాజ్యలక్ష్మి దంపతులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ కేంద్రం మహిళలకు స్వయం ఉపాధి అంశాల్లో శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఉపయోగపడుతుందన్నారు. కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించిన టీజీ వెంకటేష్ దంపతులను ట్రస్ట్ చైర్మన్ చిలమకూరు రాజశేఖర్ తదితరులు ఘనంగా సత్కరించారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

సి.బెళగల్: మండల ప్రజలు దీపావళి పర్వదినాన్ని జాగ్రత్తలు పాటిస్తూ నిర్వహించుకోవాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదివారం ప్రకటనలో సూచించారు. దీపావళి వేడుకల్లో భాగంగా బాణసంచా కాల్చే ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు అధిక శబ్దాలు వచ్చే టపాకాయలకు దూరంగా ఉండాలన్నారు. పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అదేవిధంగా అనుమతులున్న దుకాణాదారులు మాత్రమే జనవాసాలకు దూరంగా టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, నిబ్బంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు నాగన్న

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు బంగ్లా ప్రాంతంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలోని బంగ్లా ప్రాంతంలో పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. నన్నూరు గ్రామంలో నాలుగు రేషన్ షాపులు ఉండగా, అవన్నీ పాత గ్రామంలోనే ఉన్నాయని ప్రతి నెలా బంగ్లా ప్రాంత ప్రజలు రెండు కి.మీ. దూరం వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవడం ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. బంగ్లా ప్రాంతంలో సుమారు 5 వేల మంది జనాభా ఉన్నప్పటికీ రేషన్ షాపు అందుబాటులో లేకపోవడంతో వృద్ధులు, మహిళలు పాత గ్రామానికి వెళ్లాలంటే పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించి బంగ్లా ప్రాంతంలో ప్రత్యేక రేషన్ షాపును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేకపోతే ప్రజలను మమేకం చేసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నన్నూరు శాఖా కార్యదర్శి మధుసూదన్, మండల కమిటీ సభ్యుడు మల్లేష్, పార్టీ సభ్యుడు మహేష్, మాసుంబాషా, స్వాములు, వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోండి


సర్టిఫికెట్లు పొందిన కరాటే విద్యార్థులు

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక అబ్బాసనగర్‌లోని రవీంద్ర స్కూల్ పక్కన పెన్షనర్స్ అసోషియేషన్ ప్రాంగణంలో ప్రముఖ కరాటే మాస్టర్ రాంబాబు పిల్లలకు శిక్షణ ఇస్తున్నారని, ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత సీఐ ఎస్.రంగారెడ్డి సూచించారు. ప్రతి నాలుగు నెలలకోసారి శిక్షణను బట్టి కరాటే పోటీలు నిర్వహించి గ్రీన్, ఎల్లో, బ్లాక్ బెల్ట్‌లతో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. సర్టిఫికెట్‌లు పొందిన వారికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందచేశారు. కరాటే మాస్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు అబ్బాస్ నగర్‌లోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సంప్రదాయ కళలకు ప్రోత్సాహం


కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: ప్రాచీన సంప్రదాయ కళలను ప్రోత్సాహిస్తామని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో టీటీడీ ఆస్థాన హరికథకురాలు లక్ష్మీ మహేష్ హరికథా గానం చేశారు. 'శ్రీకృష్ణ రాయబారం'పై ఆమె చేసిన హరికథా గానం, పిడుగు చిన్న సుబ్బరాయుడు జానపద గేయాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సంప్రదాయ కళలను బతికించుకుందాం అనే నేపథ్యంలో హరికథా గానం ఏర్పాటు చేశామన్నారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కర్నూలు ఉత్సవ్‌లో ప్రాచీన సంప్రదాయ కళలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అంతరించి పోతున్న హరికథ, బుర్రకథ, జానపద కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. కళాక్షేత్రం మాజీ అధ్యక్షుడు దస్తగిరి, విశ్రాంత ఎంఈఓ రాజారత్నం, సభ్యులు గురుమూర్తి, రమణ, లక్ష్మీకాంతరావు, శ్రీనివాసరెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

వంతెన సమస్య తీరేనా?


బ్రిడ్జి వద్ద ఇరుక్కుపోయిన మొద్దును తాడుతో లాగుతున్న గ్రామస్తులు


బ్రిడ్జి వద్ద గడ్డిని తొలగిస్తున్న గ్రామస్తులు


ఇటీవల వర్షాలకు ఉప్పొంగిన వాగు

- చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లుతున్న వాగు
- రాకపోకలు నిలిచిపోతున్న వైనం
- లో లెవల్ బ్రిడ్జి కింద పెరుకుపోయిన పూడిక
- బ్రిడ్జి ఎత్తు తగ్గడంతో నిత్యం సమస్యలే
- పట్టించుకోని అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని వడ్డుగండ్ల – రసూళ్లపేట గ్రామాల మధ్య కావేటి వాగు సమస్య నానాటికి తీవ్రమవుతోంది. బ్రిడ్జి పూర్తిగా తగ్గులో ఉండడం వల్ల చిన్నపాటి వర్షానికే పైనుంచి వచ్చే నీరు బ్రిడ్జి పైకెక్కి ప్రవహిస్తుంది. వరద తగ్గే వరకు వడ్డుగండ్ల ప్రజలు గ్రామానికే పరిమితం కావాల్సి ఉంటుంది. దీంతో వర్షాకాలంలో గ్రామస్తులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అత్యవసర సమయంలో కూడా గ్రామం దాటలేని పరిస్థితి ఎదురవుతుంది. ఈ ఏడాది పలుమార్లు వర్షాల కారణంగా వడ్డుగండ్ల ప్రజలు పడిన కష్టాలు వర్ణణాతీతం. బ్రిడ్జి సమస్యపై వందల సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. లో లెవల్ బ్రిడ్జిపై నీటి ప్రవాహం తగ్గితేనే నిత్యవసరాలు గ్రామానికి చేరుకుంటాయి లేని పక్షంలో ప్రజలు అల్లాపోవాల్సిందే. అంతలా బ్రిడ్జి సమస్య నెలకొంది. గ్రామంలో 150కి పైగా గృహాలు, 600 మందికి పైగా ఓటర్లు ఉన్నారు. గ్రామంలో పశుపోషణ అధికంగా ఉంది.

లో లెవల్ బ్రిడ్జితో సమస్య

వడ్డుగండ్ల–రసూళ్లపేట గ్రామాల మధ్య కావేటి వాగుపై బ్రిడ్జి పూర్తిగా తగ్గులో ఉంది. ఈ వాగుకు పాణ్యం పొలాల నుంచి, వాగుల నుంచి భారీగా వరద నీరు చేరుతుంది. చిన్నపాటి వర్షానికే బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుంది. ఈ ఏడాది పలుమార్లు వర్షాలకు బ్రిడ్జిపై 3–4 అడుగుల మేర నీరు ప్రవహించాయి. దీంతో అత్యవసర సేవలన్నీ నిలిచిపోయాయి. నీరు తగ్గేందుకు కనీసం 2–3 రోజుల సమయం పడుతుంది. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వాగుపై తగిన ఎత్తులో నూతన బ్రిడ్జి నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.

రూ.30 లక్షలతో ప్రతిపాదనలు

వడ్డుగండ్ల –రసూళ్లపేట గ్రామాల మధ్య ఉన్న కావేటి వాగుపై నూతన బ్రిడ్జి నిర్మించేందుకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. వాటికి అనుమతులు రాగానే పనులు చేపట్టి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాలేదు.

– మహబూబ్‌బాషా, ఏఈ, పంచాయితీరాజ్ శాఖ

గ్రామస్తులే రంగంలో దిగి..

గత వారం కురిసిన వర్షాలకు కావేటి వాగుకు భారీగా చెట్ల మొద్దులు, చెత్త చెదారం కొట్టుకొచ్చాయి. లో లెవల్ బ్రిడ్జి వద్ద పేరుకుపోవడంతో దిగువకు నీరు వెళ్లేందుకు మార్గం లేకపోయింది. రాకపోకలు నిలిచిపోయాయి. సమస్యను అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులే రంగంలోకి దిగి తాళ్ల సాయంతో బ్రిడ్జికి అడ్డుపడిన మొత్తలను, చెట్లను తొలగించారు. అలాగే వాగులో పేరుకుపోయిన చెత్తను, గడ్డిని కొడవళ్లతో కోసి నీటి ప్రవాహంలో దిగువకు వెళ్లేలా చేశారు. తమ సమస్యను పట్టించుకోని అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నగరాభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న బాబురావు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరాభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు డిమాండ్ చేశారు. పాలకుల నిర్లక్ష్యంతో నగరాభివృద్ధి కుంటుపడిందని, కనీసం ప్రజలకు మంచినీళ్లు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఆదివారం కర్నూలు ఎంపీపీ హాలులో సీపీఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన కర్నూలు నగరాభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బాబురావు మాట్లాడుతూ.. నగర జనాభా పెరిగిపోతున్నా అందుకు తగ్గట్లుగా పాలకులు, అధికారులు సదుపాయాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. పాలకులు కేవలం కమీషన్ల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. టిడ్కో గృహాలను ప్రజలకు కేటాయించడం లేదని, రెండో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఏటా ఆస్తి పన్ను 15 శాతం పెంచుతున్నారని మండిపడ్డారు. తుంగభద్ర, హంద్రీ నదుల పరిరక్షణకు రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, అంజిబాబు, విజయ్, నగేష్, నరసింహ, అరుణ, శ్యామల, అబ్దుల్‌దేశాయ్, షరీఫ్, రామకృష్ణ,సుధాకరప్ప, నరసింహులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

భోగభాగ్యాలనిచ్చే భోగేశ్వరుడు

- దక్షిణకాశీగా వెలుగొందుతున్న క్షేత్రం
- భోగేశ్వరుని దర్శనం సర్వపాపహరణం
- ఈ నెల 22వ తేదీ నుంచి కార్తీక మహోత్సవాలకు ముస్తాబవుతున్న క్షేత్రం


భోగేశ్వరాలయం విహంగ వీక్షణం


పూజలందుకుంటున్న భోగేశ్వరుడు


దుర్గాభోగేశ్వరాలయం


ప్రధాన కోనేరు


ఆలయ ప్రాంగణంలో అన్నచెల్లెళ్ల విగ్రహాలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఎర్ర కనుమ కొండల్లో వెలసిన దుర్గాభోగేశ్వర స్వామి దర్శనం భక్తులకు సర్వపాపహరణం అని ప్రతీతి. భోగభాగ్యాలు ఇచ్చే భోగేశ్వరుడిగా స్వామివారు ప్రసిద్ధి చెందారు. దక్షిణ కాశీగా ఈ ఆలయం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. పూర్వం భోగోలు అనే గ్రామం ఉండటంతో ఈ క్షేత్రానికి భోగేశ్వరం అనే పేరు వచ్చింది.

ఆ గ్రామంలో పేద దంపతులకు అబ్బాయి, అమ్మాయి సంతానం కలిగారు. పిల్లలు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. చిన్నారులను సంతానం లేని వారు వేర్వేరుగా చేరదీసి పెంచుకుంటుండేవారు. ఒకరికి ఒకరు తెలియని పరిస్థితులలో పెద్దవారైన వారిద్దరికి తెలియక వివాహం చేస్తారని పురాణాల కథనం. పెళ్లైన భార్యభర్తలు పడక గదిలోకి వెళ్లే ప్రయత్నంలో అదే ఇంట్లో పడుకున్న లేగ దూడ తోకను వరుడు తొక్కుతాడు. అప్పుడు దూడ మనుషుల భాషలో తన తల్లితో అమ్మ వాడు నాతోక తొక్కాడు అంటుంది. దానికి తల్లి ఆవు బదులిస్తూ.. వాడు సొంత చెల్లినే వివాహం చేసుకున్నాడు, చూసు కోడులే అంటుంది. ఆ మాటలు విన్న వరుడు కలత చెంది విషయం తెలుసుకుని తెలియక తప్పు చేశానని వేడుకోగా అప్పుడు ఆవు వికండ మహర్షి కుమారుడు ఋష్యశృంగ మహర్షి వద్దకు వెళ్లి శరణు వేడుకోమని చెప్పడం, వారు ఋషి వద్దకు వెళ్లగా తలంబ్రాలు, పసుపు పచ్చని వస్త్రాలు ఇస్తాడు. బ్రహ్మముడితో అన్ని క్షేత్రాలలోని కొనేర్లలో స్నానం చేయాలని, ఎక్కడైతే మీ పసుపు వస్త్రాలు తెల్లగా మారుతాయో అప్పుడు పాపపరిహారం అవుతుందని ఋషి చెప్తాడు. వారిద్దరూ అన్ని క్షేత్రాలు తిరిగి పండు ముసలివారు కావడం, చివరగా దుర్గాభోగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించి ఇక్కడి పంచామృత కోనేరులో స్నానం చేయగా వస్త్రాలు పసుపు వర్ణం పోయి తెల్లగా మారతాయి. అప్పుడు పాపవిముక్తి పొందుతారని కథనం. అలాగే కాశీలో తప్ప మరే క్షేత్రంలో లేని కాలభైరవుడు భోగేశ్వరంలో ఉన్నందున ఈ క్షేత్రం దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచింది.

కార్తీక మహోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

కార్తీక మహోత్సవాల సందర్భంగా దుర్గా భోగేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రామానుజన్ తెలిపారు. ఈ నెల 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాసం కావడంతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానాచార్యకులు శ్యామ్‌సుందర్ శర్మ చెప్పారు. 27న మొదటి సోమవారం స్వామివారికి తెల్లవారుజామునే అభిషేకాలు, అదే రోజు సాయంత్రం గడిగరేవుల గ్రామంలో ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. నవంబర్ 3న రెండవ సోమవారం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు, 5వ తేదీ ఉదయం స్వామివారి కల్యాణోత్సవం, అనంతరం గడిగరేవుల గ్రామంలో స్వామివారికి గ్రామోత్సవం ఉంటుంది. 10వ తేదీన మూడవ సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం జరుపుతారు. 17న నాల్గవ సోమవారం భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలతో పాటు ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఈఓ చెప్పారు. 20వ తేదీన కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఆలయానికి వచ్చే భక్తుల కొరకు నంద్యాల, నందికొట్కూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు.

భక్తులకు అన్నదానం


భోగేశ్వరాలయానికి వచ్చే భక్తులకు కాశిరెడ్డినాయన, ఆర్యవైశ్య అన్నదాన సత్రాలలో ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మూడవ సోమవారం జంగం నాగమల్లయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాలు అందిస్తారు.

భోగేశ్వరుడి దర్శనంతో పాపాలు తొలగుతాయి



కార్తీకమాసం సందర్భంగా భోగేశ్వరుడిని, అమ్మవారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపాతాయి. నేను ఇరవై ఏళ్లుగా స్వామి వారి సేవలో తరిస్తూ భక్తుల ఆదరాభిమానాలు పొందుతున్నాను. కార్తీక మాసంలో స్వామి వారిని దర్శించుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. – శ్యాంసుందర్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు, భోగేశ్వరం

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశాం. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.

– రామానుజన్, ఈఓ, భోగేశ్వరాలయం